News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :153 | ఖమ్మం | శనివారం, జూలై 11, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

- ఇదే అదనుగా నాసా టెక్నాలజీ అంటూ నకిలీ ఏసీల అమ్మకం!
- యూకేలో పోర్టబుల్ ఏసీల పేరిట భారీ ఆన్‌లైన్ మోసం
- నాసా టెక్నాలజీ, 90 సెకన్లలో కూలింగ్ అంటూ తప్పుడు ప్రచారం
- ఇవి ఏసీలు కావు, కేవలం తడి అట్టలున్న ఫ్యాన్లు మాత్రమే
- ఇలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక




## ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

- ఈ20 పెట్రోల్‌తో వాహనాల మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చు : కేంద్రం
- ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని వెల్లడి
- 2025–26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20 శాతం మిశ్రమాన్ని చేరుకుంది





## ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా

- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయాలు
- ఔషధాల్లో 12 శాతానికి మించి ఆల్కహాల్ ఉంటే లైసెన్స్ తప్పనిసరి
- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి
- ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం



## మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి

- అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం
- రూ.50 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఇప్పటికే దేశంలో మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో తెలంగాణ
- తొలిసారిగా కోహెడలో ఇంటర్నేషనల్ మంచి నీటి చేపల ఎగుమతుల కేంద్రం

హైదరాబాద్

రాష్ట్రంలో మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే దేశంలో మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలో చేపల ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా కోహెడలో ఇంటర్నేషనల్ మంచి నీటి చేపల ఎగుమతుల కేంద్రం కొలువు తీరనుంది. - మిగతా3లో

# మళ్లీ మాదే అధికారం

- భద్రాద్రి రామయ్య మీద ఒట్టు
- వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తాం
- రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని చేస్తాం
- కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం
- రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణం..
- తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయ



హైదరాబాద్

వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 మే, జూన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్న రేవంత్ రెడ్డి, అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, పార్లమెంట్ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని వెల్లడించారు. భద్రాచలం రాముడి మీద ఒట్టు, వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్, అతని బంధువులు, దొంగ సర్వేలను ఓడిస్తామని సవాల్ చేశారు. ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని - మిగతా3లో



## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

- చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్
- 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నామన్న మోదీ
- క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడి



## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

- బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం
- తొక్కిసలాట తర్వాత సీఎం హోదాలో తొలిసారి కరూర్‌కు విజయ్
- కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం

# రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు

- 'సర్' పొడిగింపు మా పరిధిలో లేదు
- ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఐఆర్
- జూన్ 25 నుంచి జులై 24 వరకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాల అందజేత



హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 98 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరిగిందని.. ఈనెల 24వ తేదీ వరకు పత్రాల డిజిటల్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ రాకపోతే ఆగష్టులో ఫామ్ 6, 8 ఇస్తారని.. నింపి ఇవ్వాలన్నారు. 'సర్' ప్రక్రియ ముగిసిన తర్వాత కొత్త - మిగతా3లో

# రాష్ట్రంలో తాండవిస్తున్న కరవు



- రానున్న 3 నెలలూ లోటు వర్షపాతమే!
- 19 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులే
- అక్టోబర్ వరకు సాధారణం కన్నా తక్కువ వర్షాలే కురిసే అవకాశం
- వెలవెలబోతున్న కృష్ణా, గోదావరి బేసిన్లు
- జలాశయాల్లో గణనీయంగా తగ్గిన నీటి నిల్వలు
- ఎల్‌నినోతో తెలంగాణలో కరవు

హైదరాబాద్

రాష్ట్రంలో కరవు తాండవిస్తోంది. వానాకాలంలో కీలకమైన జూన్ మాసాంతం ఒక్క భారీ వర్షం కూడా కురవకుండా, గాలి చినుకులతోనే గడిచిపోయింది. ప్రస్తుతం జులై రెండో వారంలోకి కూడా అడుగుపెట్టాం. అయినా ఇప్పటికీ ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదు. దీంతో అప్రమత్తమైన సర్కారు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మెట్ట పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జులైలో సగటు కన్నా 15 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో జులై 9 నాటికి 185.4 మిల్లీ - మిగతా3లో




## జాతీయ గీతం తప్పనిసరి!

- జాతీయ గీతం జనగణమన, వందేమాతరం ఆలాపనపై కేంద్రం కీలక ఆదేశాలు
- జాతీయ గీతం, జాతీయ గేయం ఆలాపనలో సరైన సాహిత్యం, ఉచ్చారణ తప్పనిసరి
- కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు
- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా మార్గదర్శకాల్ని పునరుద్ఘాటించిన కేంద్రం

## ముత్తూట్ ఫైనాన్స్‌లో భారీ మోసం

- కస్టమర్ల బంగారాన్ని మరో సంస్థలో తాకట్టు పెట్టిన మేనేజర్
- హైదరాబాద్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో వెలుగుచూసిన వైనం
- కస్టమర్ల బంగారాన్ని దుర్వినియోగం చేశారని బ్రాంచ్ మేనేజర్‌పై ఆరోపణ
- తక్కువ వడ్డీ ఆశ చూపి సొంత ఖాతాలకు డబ్బు మళ్లింపు
- మేనేజర్ ప్రియాంక రెడ్డిపై కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు



# రాష్ట్రంలో తాండవిస్తున్న కరవు

-మొదటిపేజీ తరువాయి

మీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ 156.7 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 19 జిల్లాల్లో లోటు వర్షపాతమే కురిసినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

ప్రధాన నదులైన కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని జలాశయాల్లో రాష్ట్రానికి ప్రస్తుతం 31.53 శాతం మాత్రమే నీటి వాటా ఉన్నట్లు పేర్కొంది. ఈ అంశాలపై భారత వాతావరణ శాఖ, టీజీడీపీఎస్?తో పాటు పలు ప్రభుత్వ శాఖలు రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం పలు కీలక నివేదికలు అందించాయి.



### ప్రధాన నదుల బేసిన్‌లు వెలవెల

ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా నెలకొంటున్నాయి. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కర్ణాటకలోని కృష్ణా బేసిన్?లో ఉన్న ఆలమట్టి మినహా ప్రస్తుతం మన రాష్ట్రంలోని గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లోని ప్రధాన జలాశయాలకు నీటి ప్రవాహాలు రావడం లేదు. దీంతో ఆయా జలాశయాల్లోని నీటి మట్టాలు అడుగంటి, ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా గోదావరి బేసిన్? నీరు లేక వెలవెలబోతోంది. ఉప నదులు, వాగుల్లో కూడా ప్రవాహాల జాడ లేదు. 80 శాతం చెరువులూ అడుగంటినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

### కృష్ణా బేసిన్‌లో గతేడాదితో పోలిస్తే

కృష్ణా పరీవాహక ప్రాంతంలోని జలాశయాల్లో గతేడాదితో పోలిస్తే గణనీయంగా నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఆలమట్టి నుంచి పులిచింతల ప్రాజెక్ట్ వరకు 973.68 టీఎంసీల నిల్వ సామర్థ్యం కాగా, ఇప్పుడు 378.17లు మాత్రమే నిల్వ ఉంది. ఇదే సమయానికి గత సంవత్సరం 712.80 టీఎంసీల నీటి నిల్వ ఉంది. తెలంగాణ ప్రాంత పరిధిని పరిగణించి తుంగభద్ర, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్?లను తీసుకుంటే, వీటన్నింటి పూర్తి నిల్వ సామర్థ్యం 643.31 టీఎంసీలు. ఇందులో గతేడాది 460.54 టీఎంసీలు నిల్వ ఉండగా, ప్రస్తుతం కేవలం 199.58 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది.

గోదావరి బేసిన్‌లో ప్రస్తుత నీటి నిల్వలు

గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎగువలో ఉన్న మహారాష్ట్ర నుంచి దిగువన ఉన్న జలాశయాల వరకు 307.40 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ఇందులో గతేడాది 140.94 టీఎంసీలుండగా, ప్రస్తుతం 96.41 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. తెలంగాణ పరిధిలోని నిజాంసాగర్, సింగూరు, శ్రీరాంసాగర్, అప్పర్?, మిడ్ మానేరులు, ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 48.11 టీఎంసీల నిల్వలుండగా, కిందటి ఏడాది 66.45 టీఎంసీల నీరుంది.

### వచ్చే నెలలోనూ తక్కువే!

కృష్ణా బేసిన్‌లోని కొంత ప్రాంతంలో ఈ నెల రెండు, మూడు వారాల వరకు సాధారణం కన్నా తక్కువ వర్షాలు కురవొచ్చని ఐఎండీ నివేదించింది. గోదావరి పరీవాహకంలోని చాలా ప్రాంతాల్లో లోటు వర్షపాతమే నమోదు కావొచ్చని పేర్కొంది. చివరి వారంలో స్వల్పంగా వర్షించే అవకాశం ఉన్నా, మొత్తంగా 36 శాతం లోటు వర్షపాతమే నమోదు కావొచ్చని తెలిపింది. వచ్చే నెలలో కృష్ణా బేసిన్?లో సాధారణం కన్నా ఎక్కువగా, గోదావరి పరీవాహకంలో సాధారణ స్థాయిలో వానలు కురిసే అవకాశముంది. అయినా ఆగస్టులోనూ 14 శాతం లోటు వర్షపాతమే నమోదు కావొచ్చని చెప్పింది.

### ఈ నెలల్లో ఉపశమనం

సెప్టెంబర్, అక్టోబర్‌లలో రెండు ప్రధాన నదుల పరీవాహక ప్రాంతంలో సాధారణం కన్నా లోటు వర్షపాతమే ఉంటుంది. సెప్టెంబర్‌లో 42 శాతం ఉంటే, అక్టోబర్?లో 56 శాతం లోటు వర్షపాతం ఉండొచ్చని అంచనా. నవంబర్? నుంచి జనవరి మధ్యలో రెండు బేసిన్లలో సాధారణ స్థాయి మేరకు వర్షించవచ్చు. నవంబరులో 9 జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా కొద్ది మేరకు ఉపశమనం కలిగించవచ్చు. ఈ సమయంలో సగటు వర్షపాతం 2 శాతం ఎక్కువగా నమోదు కావొచ్చు.

# రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు

-మొదటిపేజీ తరువాయి

ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుంది. కొత్త ఓటర్ నమోదు చేసుకుంటే నెల రోజుల్లో ఈసీఐ ఇస్తుంది. ఓటు ఉండి.. ఎన్యూమరేషన్ ఫామ్ రాకపోతే బీఎల్‌వోను సంప్రదించాలి. తెలంగాణలో తప్పుడు వివరాలు ఉన్న ఓటర్లు అనామలీస్ 89 లక్షలు ఈసీఐ గుర్తించింది. త్వరలో అక్షర దోషాలు ఉన్న అనామలీస్ ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ నోటీసులు ఇస్తుంది" అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

రైట్ టు ఇన్ఫర్మేషన్ అనేది ప్రతీ ఒక్కరికీ ముఖ్యమైనది. ఓటర్ సవరణ నిరంతరం జరిగే ప్రక్రియ. ఎన్నికలకు ముందు జరిగే స్పెషల్ సమ్మరి రివిజన్ జరిగేది. ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. ఓటర్ ప్రక్షాళన చేయాలని ఈసీఐ నిర్ణయం తీసుకుంది. 'సర్' ప్రక్రియ రెండు భాగాలుగా జరుగుతుంది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాక రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష పడుతుంది. డీఎస్ఏ సాఫ్ట్‌వేర్ ద్వారా దేశ వ్యాప్తంగా రెండు ఓట్లపై ప్రక్షాళన చేస్తారు. 2002 డేటా లేకపోతే ఆ ఓటర్లకు నోటీసులు ఇచ్చి ప్రత్యేక సర్వే జరుగుతుంది. ఏజెన్సీ ఏరియాల్లో 59 శాతం ఫామ్స్ నింపి తిరిగి ఇచ్చారు. ఓల్డ్ సిటీలోని 7 నియోజకవర్గంలో ఫామ్స్ అందాయి. డిజిటలైజేషన్ జరుగుతుంది. ఓటు లేకపోతే సంక్షేమ పథకాలు ఇస్తారా? లేదా? ప్రభుత్వం నిర్ణయం" అని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.




### కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్

'సర్' 2026 పురోగతిపై కేంద్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అధ్యక్షతన సమీక్ష జరిగింది. తెలంగాణ నుంచి పాల్గొన్న సీఈవో సుదర్శన్ రెడ్డి, డీఈవోలు, ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు హాజరయ్యారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ వేగవంతం చేయాలని కేంద్రం ఈసీఐ ఆదేశించింది. హైదరాబాద్‌లో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చింది.

రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో డిజిటైజేషన్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్న కేంద్ర ఎన్నికల సంఘం.. సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొంది. రోజువారీ డిజిటైజేషన్ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇతర జిల్లాలు అమలు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ లక్ష్యాలను నిశితంగా పర్యవేక్షించాలని తెలంగాణ సీఈవోను ఆదేశించింది.

# మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

13 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో కూడిన ఈ మార్కెట్ నిర్మాణం పనులకు పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంఖుస్థాపన చేశారు. 2027 ఆగస్టు వరకు ఎగుమతి ఆధారిత అత్యాధునిక ఫిష్ మార్కెట్ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న దృష్ట్యా ప్రత్యక్షంగా పరోక్షంగా ఐదు వేల మంది ఉపాధి కలుగనుంది.

### 13 ఎకరాల విస్తీర్ణంలో

తెలంగాణ మత్స్య రంగానికి సరికొత్త గుర్తింపు లభించనుంది. హైదరాబాద్ శివారు కోహెడలో దేశంలోనే మొట్టమొదటిసారిగా మంచి నీటి చేపల అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కానుంది. మోదీ సర్కారు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఈ మెగా ప్రాజెక్టు మంజూరైన నేపథ్యంలో జాతీయ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని కోహెడలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పునాదిరాయి పడింది. బాహ్య వలయ రహదారి పక్క 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఎగుమతి ఆధారిత అంతర్జాతీయ చేపల మార్కెట్ నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేశారు.

### దేశంలోనే తొలిసారి

ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టు నిర్మాణం సంబంధించి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించనున్నాయి. దేశంలో ఇప్పటి వరకు కేవలం సముద్రతీర ప్రాంతాల నుంచే సముద్ర చేపల ఎగుమతుల కేంద్రాలు నడుస్తున్నాయి. అయితే మంచి నీటి చేపల ఎగుమతుల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తుండటం దేశంలోనే ఇదే తొలిసారి. నగర శివారు కోహెడలో అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన అత్యాధునిక ఎగుమతి ఆధారిత చేపల మార్కెట్ ఏర్పాటు కానుండటం పట్ల ఈ ప్రాంతాల్లో మంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతోన్నాయి.

### దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ

మంచినీటి వనరుల ద్వారా చేపల ఉత్పత్తిని సాధించడంలో తెలంగాణ ఇప్పటికే దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత సంవత్సరం రూ.8 వేల కోట్లు విలువైన 4.20 లక్షల టన్నులు పైగా మంచి నీటి చేపలు, రూ.1000 కోట్ల రూపాయల విలువైన 15 వేల టన్నుల మంచి నీటి రొయ్యల ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది. అయితే రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఈ మంచి నీటి చేపల్లో 42 శాతం మాత్రమే స్థానికంగా వినియోగం అవుతుండగా కేవలం 6 శాతం మాత్రమే ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మిగిలిన నిల్వలు సరైన మార్కెటింగ్, రవాణా సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి.



### రెండేళ్ల క్రితమే మంజూరు

ఈ ఆర్థిక పరమైన గణాంకాలు, అవకాశాలను నిశితంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే ఈ అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రం మంజూరు చేసినట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించిన విషయం విదితమే. గత నెలలో కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణానికి సీఎం పునాది వేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. "సమాజంలో ముదిరాజుల సంఖ్య చాలా పెద్దది. వారికి, చేపపిల్లలు, గొర్రెపిల్లల్ని ఇచ్చినంత మాత్రాన బాగుపడరు. వారి వృత్తికి అనుగుణంగా కావాల్సిన సదుపాయాలు పొందే విధంగా చేస్తేనే వారి జీవితాల్లో వెలుగు కనిపిస్తుంది. ఇది ఇంటిగ్రేటెడ్? మార్కెట్?. మనదేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నాం. మత్స్యకార వృత్తి చేపట్టిన వారందరి అభివృద్ధే దీని ధ్యేయం"

### అంతర్జాతీయ ప్రమాణాలతో

ఈ అంతర్జాతీయ చేపల ఎగుమతి కేంద్రం నిర్మాణానికి సంబంధించి చెన్నైకు చెందిన ఒక ప్రముఖ కన్సల్టెన్సీ కంపెనీ ఆధ్వర్యంలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించింది. అంతర్జాతీయ నాణ్యతా, సాంకేతిక ప్రమాణాలతో కూడిన అధునాతన పరిపాలన భవనం, మత్స్యకారుల శిక్షణ కేంద్రం, అతిథి గృహం, హోటల్, అత్యాధునిక శీతల గిడ్డంగులు, చేపల శుద్ధి యూనిట్లు, రవాణా ప్రాంగణాలు, సిబ్బంది నివాస గృహాలు కూడా నిర్మించనున్నారు.

### జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులు ఒకే చోట

ప్రత్యేకించి వివిధ సాంకేతిక సంస్థలు, అధునాతన చేపల పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ ఎగుమతులకు తక్షణ అనుమతులు ఇచ్చే అపెడా, కస్టమ్స్ క్లియరెన్స్ కేంద్రాలు కూడా ఇక్కడే ఒకే ఛత్రం కింద ఏర్పాటు కానున్నాయి. దాదాపు రెండు వేల మంది పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులు ఒకే చోట క్రయ, విక్రయాలతో ఏటా 500 కోట్ల రూపాయలు పైగా లావాదేవీలు జరిపేలా ఈభారీ టోకు మార్కెట్ ఈ ప్రాంగణంలో అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటన్న చర్యలకు మనం మద్ధతివ్వాలని పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు.

"ఈ ప్రాంతం నుంచి సుమారు 9 దేశాలకు, ప్రపంచ మార్కెట్?ను తలదన్నే విధంగా మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాం. వీటి ఉత్పత్తిలో రాష్ట్రాన్ని బ్రాండ్?గా చేయదానికి సర్కార్? యోచిస్తోంది. దీని ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయి. రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసి మత్స్య రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తాం" - వాకిటి శ్రీహరి, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి

### ఆలోగా పూర్తి

2027 ఆగస్టు నాటికి ఈ అంతర్జాతీయ చేపల కేంద్రం నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేయాలన్నది లక్ష్యం. లోడింగ్, అన్‌లోడింగ్, ప్రాసెసింగ్, ప్యాకేంగ్, ఇతర అనుబంధ విభాగాలు అందుబాటులో రానున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు వైద్యారోగ్య, మౌలిక సదుపాయాల సంస్థ చేపట్టనుంది.

## మళ్లీ మాదే అధికారం

-మొదటిపేజీ తరువాయి

చేస్తామని, కేసీఆర్ కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే తన గుండె పులకిస్తోందన్న సీఎం, రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణమని, తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కోగలరని కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు.

### పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశాం

బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు.

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన. - రేవంత్? రెడ్డి ముఖ్యమంత్రి

కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు

నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని, నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్? రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు.

### భద్రాచలం రాముడు మునగాలా

మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా? అని సవాల్? విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు. "బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చలేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్టానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతాం" - రేవంత్ రెడ్డి

## ముత్తూట్ ఫైనాన్స్‌లో భారీ మోసం..

హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో గల ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ 'ముత్తూట్ ఫైనాన్స్' బ్రాంచ్‌లో భారీ మోసం వెలుగుచూసింది. ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను బ్రాంచ్ మేనేజర్ దుర్వినియోగం చేశారని, తమను ఆర్థికంగా నష్టపరిచారని బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ ఫేజ్-6 బ్రాంచ్ మేనేజర్ ప్రియాంక రెడ్డి ఈ మోసానికి సూత్రధారి అని ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 50 పైసల తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని కస్టమర్లను నమ్మించి, వారి నుంచి బంగారాన్ని డిపాజిట్ చేయించుకున్నారు. అనంతరం ఆ తర్వాత ఆ బంగారాన్ని తనకు సంబంధమున్న మరో ఫైనాన్స్ సంస్థలో తాకట్టు పెట్టి, ఆ నిధులను తన వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అక్రమ లావాదేవీల నిర్వహణ కోసం కస్టమర్ల ఫోన్లకు వచ్చే ఓటీపీలను సైతం ఆమె మాయమాటలతో సేకరించినట్టు తెలిసింది. గురువారం ఓ వృద్ధుడు తాను తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించి, తన బంగారు ఆభరణాలను తిరిగి ఇవ్వాలని కోరడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఆ సమయంలో మేనేజర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చిన మిగతా బాధితులు సైతం ఆమెను నిలదీశారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులంతా కలిసి కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సంస్థలో సమగ్ర ఆడిట్ నిర్వహిస్తేనే మోసం విలువపై స్పష్టత వస్తుందని, ఇది కోట్లలో ఉండే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## తెలంగాణ జనసేనలో కొత్త జోష్..

## పవన్ సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు

**తెలంగాణ జనసేనలోకి పలువురు ప్రముఖుల చేరిక**

**పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు**

**పార్టీలో చేరిన తెలంగాణ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రవీందర్**



తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు. వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు. వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు బత్తిని సత్యనారాయణ గౌడ్, ఆరే మహేందర్, వైద్య రంగ నిపుణులు డాక్టర్ బండారు రాజ్‌కుమార్, డాక్టర్ ఎడ్ల సాయి కృష్ణప్రియ కూడా జనసేనలో చేరారు. పవన్ కల్యాణ్ నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు, 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే వ్యూహంలో భాగంగా ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం, మంత్రికి మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం



దేవాపూర్: మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం న్యాయమైన డిమాండ్ మరియు మాంగ్ సమాజ్ ప్రజల చిరకాల స్వప్నం మాంగ్ కులానికి కుల ధృవీకరణ పత్రం తహశీల్దార్ ద్వారా జారీ చేయాలనే ఉత్తర్వును జారీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మాంగ్ సమాజ్ ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు శ్రీ వాగ్మారె అంకుష్ మాంగ్ మరియు దేవాపూర్ మాంగ్ సమాజ్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మాంగ్ సమాజ్ ప్రజలు =ఖా కార్యాలయం ద్వారా కుల ధృవీకరణ పత్రం సకాలంలో పొందలేక చాలా ఇబ్బందులు పడుతూ వచ్చారు. గతంలో ఈ కుల ధృవీకరణ పత్రం పొందుటలో ఉన్న ఇబ్బందులను భరించలేక మాంగ్ సమాజ్ ప్రజలు తహశీల్దార్ కార్యాలయం ద్వారా సులభంగా కుల ధ్రువీకరణ పత్రం లభించే కులం పేరుతొ పత్రాలు పొందడం వలన రాష్ట్రంలో మాంగ్ కులం ఉనికి, అస్థిత్వానికి ప్రమాదం వాటిల్లిందనీ అన్నారు.మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షులు శ్రీ గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ గారి న్యాయమైన కోరికను మన్నించి మాంగ్ సమాజ్ ఆత్మ గౌరవం, ఉనికిని కాపాడుతూ మాంగ్ కులానికి కుల ధృవీకరణ పత్రం జారీ చేసే అధికారం తహశీల్దార్ కు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసినందుకు గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి , సాంఘిక సంక్షేమ శాఖా మంత్రివర్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ మాంగ్ సమాజ్ దేవాపూర్ కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇక నుంచి మాంగ్ కులం పేరుతో తప్పుడు కుల ధృవీకరణ పత్రం జారీ కాకుండా చూసే బాధ్యత ప్రతి సభ్యుడి పైన ఉందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర అధ్యక్షులు చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాంగ్ సమాజ్ ఇంద్రవెల్లి మండల అధ్యక్షులు వాగ్మారే అంకుష్ మాంగ్,సొన్నా బాయిమాంగ్ ,బురా బాయిమాంగ్,కృష్ణ మాంగ్,సునీల్ మాంగ్ ,సందీప్ మాంగ్ ,సాయినాథ్ మాంగ్,మాధవ్ మాంగ్ మరియు దెవాపుర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు...

## మహిళల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి బాధితులకు సత్వర న్యాయం చేయాలి -- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

- భార్యాభర్తల వివాదాల పరిష్కారంలో సున్నితంగా వ్యవహరించాలి
- ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



మహిళల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కార విధానం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళా ఫిర్యాదుదారితో గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని వెంటనే స్పందించి అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య తలెత్తే కుటుంబ వివాదాల విషయంలో అత్యంత సున్నితంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కౌన్సెలింగ్, చట్టపరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. మహిళల రక్షణ, భద్రతకు ఉమెన్ పోలీస్ స్టేషన్ కీలకమని పేర్కొంటూ, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితుల్లో విశ్వాసం కల్పించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, కేసుల దర్యాప్తును నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె ఫణిదర్, ఏఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యజమాన్యంతో మాట్లాడి దేశాయి బీడీ కంపెనీ ని ఆరు నెలల వరకు సోనాల లో కొనసాగేలా కృషిచేసిన మాజీ ఎంపీపీల శ్రీనివాస్

గత 20 రోజులుగా సోనాల దేశాయి బీడీ కార్మికులు కంపెనీ తరలిపోతున్నదని పోరాటం చేస్తున్న సందర్భంగా వారి సమస్యని తెలుసుకొని నేడు టేకేదారులతో ప్యాకింగ్ కార్మికులతో మాట్లాడి యజమాన్యని సంప్రదించి వారి సమస్యల పైన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి గారు యాజమాన్యం తో చర్చించడం జరిగింది

ఈ సందర్భంగా యజమాన్యం స్పందిస్తూ ఆరు నెలల వరకు సోనాలలోనే కంపెనీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు

ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతు కొందరు కాంగ్రెస్ ప్యారాచూట్ లీడర్లు లెటర్ ప్యాడ్లు పెట్టి గాలి మాటలు చెప్పడం కాదని వారికి చిత్తశుద్ధి ఉంటే లేబర్ మినిస్టర్ తో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని అది చేయకుండా దేనికి పనికిరాని లెటర్ ప్యాడ్లతో సమస్య పరిష్కారం కాదని తెలిపారు

అదేవిధంగా కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి కాంగ్రెస్ నాయకులు శాశ్వత పరిష్కారం చూపాలని లేని యడల శాసనసభ్యుల తో కలిసి కార్మికుల కోసం ఎక్కడికైనా వెళ్లి నూతన మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు

ఈ సందర్భంగా కార్మికులు తుల శ్రీనివాస్ గారికి సర్పంచ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

ఇట్టి కార్యక్రమంలో కంపెనీ తేకేదారులు భూషణ్ , నరసయ్య, లక్ష్మణ్, కార్మికులు రాజేశ్వర్, చందు, చిన్నయ్య, గణేష్, శ్రీనివాస్, ప్రవీణ్, రవి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు

# రైతులకు ఊరటనిచ్చిన గోదావరి జలాలు



- సీతారామ లిఫ్ట్ కెనాల్ నుంచి సాగర్ కాలువలోకి గోదావరి ప్రవాహం
- ప్రత్యేక పూజల అనంతరం నీటి విడుదలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే -- రైతులకు ఊరటనిచ్చిన ప్రభుత్వం

**జఖ న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహా ఏన్కూరు జులై 10 2026:** సీతారామ లిఫ్ట్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను సాగర్ కాలువకు మళ్లించే కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గోదావరి జలాల విడుదలకు శ్రీకారం చుట్టారు.

సాగునీటి కోసం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ గోదావరి జలాలను సీతారామ లిఫ్ట్ కెనాల్ ద్వారా సాగర్ కాలువకు మళ్లించేలా చర్యలు తీసుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం కృష్ణా జలాలు సాగర్ కాలువకు అందకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి నారు మళ్లు పోయడానికి, పంటల సాగుకు అవసరమైన నీటి కోసం బోరుబావులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు కూడా తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను సాగర్ కాలువకు మళ్లించడం రైతులకు పెద్ద ఊరటనిచ్చే నిర్ణయంగా మారింది.

సీతారామ లిఫ్ట్ కెనాల్ ద్వారా వచ్చిన గోదావరి జలాలు సాగర్ కాలువలో ప్రవహించడం ప్రారంభించడంతో ఆయకట్టు ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటితో వరి నారు మళ్లు పోసుకోవడం, ఖరీఫ్ సాగు పనులను వేగవంతం చేయడం సాధ్యమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, సరైన సమయంలో సాగునీరు అందించడం వల్ల పంటల సాగు సాఫీగా సాగుతుందని, భూగర్భ జలాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలతో వ్యవసాయానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

నీటి విడుదల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి, సాగునీటి సరఫరా విషయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

గోదావరి జలాలను సాగర్ కాలువకు మళ్లించడం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉండటంతో పాటు, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

# 42 ఏళ్ల నిరీక్షణకు తెర..

- మారుమూల విద్యార్థులకు వరం..
- ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిరిజన బాలుర వసతిగృహం ప్రారంభం




**జఖ న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహా ఏన్కూరు జులై 10 2026:** నాలుగు దశాబ్దాలకు పైగా విద్యా సేవలు అందిస్తున్న ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిరిజన బాలుర వసతిగృహం ప్రారంభం కావడంతో విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రారంభమై 42 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇంతకాలం వసతిగృహం లేకపోవడం వల్ల మారుమూల గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉండేవారు. ఈ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.

వసతిగృహ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, పాలు పొంగించి శుభారంభం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం రిబ్బన్ కట్ చేసి వసతిగృహాన్ని ప్రారంభించారు. తోరణాలతో అలంకరించిన వసతిగృహంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన సౌకర్యాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సింహాచలం మాట్లాడుతూ, కళాశాలకు హాస్టల్ లేకపోవడం వల్ల విద్యార్థుల చేరికలు తగ్గుతున్నాయని, ముఖ్యంగా దూర ప్రాంతాల విద్యార్థులు నిత్యం రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లగా, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వసతిగృహం మంజూరు చేయించారని పేర్కొన్నారు.

హాస్టల్ ఏర్పాటుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖలందరికీ కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కళాశాలలో మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం చదువుతున్న మొత్తం 40 మంది విద్యార్థులకు వసతిగృహ సదుపాయం కల్పిస్తున్నామని, వారికి సరిపడా పడకలు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సీఎల్ఆర్‌సీ భవనాన్ని వసతిగృహంగా అందుబాటులోకి తీసుకురావడం ఆనందదాయకమని అన్నారు.

హాస్టల్‌లో విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం ఆటస్థలాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం స్టడీ అవర్ నిర్వహించి విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ప్రతిరోజూ ఒక్కో అధ్యాపకుడిని బాధ్యతగా నియమిస్తామని వివరించారు.

మారుమూల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులు ప్రయాణ ఇబ్బందులతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారని, అలాంటి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వసతిగృహం ఏర్పాటు కోసం కళాశాల అధ్యాపక బృందం ఎంతో కృషి చేసిందని తెలిపారు.

కార్యక్రమం ముగింపులో వసతిగృహం సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రిన్సిపాల్ సింహాచలంను కళాశాల అధ్యాపకులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. హాస్టల్ ప్రారంభంతో ఇకపై మరింత మంది గ్రామీణ, గిరిజన విద్యార్థులు కళాశాలలో చేరి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులకు ఆర్టీసీ చార్జీల భారం...

- భద్రాచలం డిపో మేనేజర్‌కు టి డబ్ల్యూ జె ఎఫ్ వినతి.
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్( టి డబ్ల్యూ జె ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేత



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 10,** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం సేవలందిస్తున్న జర్నలిస్టులపై ఆర్టీసీ బస్సు చార్జీల భారం తీవ్రంగా పడుతోందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి డబ్ల్యూ జె ఎఫ్) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ (డిఎం) కు సంఘం ప్రతినిధులు వినతిపత్రాన్ని సమర్పించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.రవికుమార్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు డిఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. రాయితీ పేరుతో అదనపు వసూళ్లు గత ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఒకటో వంతు (1/3) రాయితీ సౌకర్యం అందుతోంది. అయితే, గత కొంతకాలంగా 1/3 చార్జీల పేరుతో ఏకంగా 50% శాతం వరకు చార్జీలను వసూలు చేస్తున్నారని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు.

**ఆర్థిక ఇబ్బందుల్లో విలేకరులు:**

నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వార్తలు సేకరించే జర్నలిస్టులకు ఈ పెరిగిన చార్జీలు తీవ్ర ఆర్థిక భారంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితిని గమనించి, నిబంధనల ప్రకారం దక్కాల్సిన అసలైన రాయితీని వర్తింపజేయాలి. పెంచిన చార్జీల భారం నుండి జర్నలిస్టులను మినహాయించాలి."జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో.. జిల్లా నాయకులు సహాయ కార్యదర్శి సంపత్ రెడ్డి. జిల్లా కమిటీ సభ్యులు పుష్పగిరి. డివిజన్ నాయకులు. సాయి కౌశిక్. సుధీర్ కుమార్, జీవన్ శివకుమార్, యాకూబ్ పాషా పాల్గొన్నారుం

## పిల్లలను ప్రతి రోజు బడికి పంపి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



పిల్లలను ప్రతి రోజు బడికి పంపి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శుక్రవారం తలమడుగు మండలం డోర్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతులు ఎంతో కీలకమని, నూతన విబిజి రామ్ జీ స్కీమ్ ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే పాఠశాలలో వసతులు మెరుగయ్యాయని, కాబట్టి తల్లిదండ్రులంతా బాధ్యతగా పిల్లలను ప్రతిరోజూ బడికి పంపించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా త్వరలోనే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ.. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతిరోజూ హోంవర్క్ ఇచ్చి పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. గతంలో వరద ముంపు ప్రాంతాల పరిశీలనకు వచ్చినప్పుడు గ్రామస్థులు బడి సమస్యలను తన దృష్టికి తెచ్చారని, దానికి స్పందించి త్వరగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులను, సర్పంచ్, కాంట్రాక్టర్ లను కలెక్టర్ అభినందించారు.

**అనంతరం పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి ఆయన మొక్కను నాటి నీరు పోశారు.**

ఈ కార్యక్రమంలో ఆదిలాబాదు మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, ఏంఆర్ఓ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ పూజ, మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవీందర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రార్థివదేహాలకు నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు గారు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ నందు మంగలి లక్ష్మమ్మ మరియు నది అగ్రహారం లో లక్ష్మీదేవమ్మ అనారోగ్యములతో మృతి చెందారు... విషయం తెలుసుకొని వారి స్వగృహాలకి వెళ్లి,ఇరువురి ప్రార్థివదేహాలకు పూలమాల వేసి, నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.....

వీరి వెంట,మాజీ కౌన్సిలర్ రామచంద్ర, నాగేందర్,రాముడు,మహేష్, రాములు,నరసింహులు,బాలు,మునేప్ప,కామేష్,వీరేష్, రాజు, కిష్టప్ప,హరి,రంగస్వామి,మరియు నాయకులు తదితరులు ఉన్నారు.....

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి...

- జులై 24లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం.
- భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ...




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 10,** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 24వ తేదీలోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఓటరు జాబితాను నవీకరించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి భారత పౌరుడు, సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితుడై, చట్టపరంగా అనర్హుడు కాకపోతే ఓటరుగా నమోదు చేసుకునే హక్కు ఉందన్నారు.

ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పనితీరు, ఓటర్ల పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని త్వరితగతిన పూర్తి చేసి, డిజిటలైజేషన్ ప్రక్రియను ఈ నెల 24లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి నిర్ణీత గడువులో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించిన వారందరి పేర్లను ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చుతామని, సరైన విచారణ లేకుండా ఏ ఓటరు పేరునూ జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. దరఖాస్తులపై విచారణ అనంతరం మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటామని, తుది జాబితాపై అభ్యంతరాలుంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల క్రమ బద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం, డిజిటలైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాల పంపిణీని శుక్రవారంతో పూర్తి చేసి, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇల్లందు ఈఆర్వో రవీంద్రనాథ్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, మణుగూరు తహసీల్దార్ నరేష్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రంగప్రసాద్, డీఎంఎల్‌టీ సాయికృష్ణ, పినపాక ఎన్నికల డీటీ అనూష, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టుల లక్ష్యం.

- కూనమనేని సాంబశివరావు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 10,** దేశంలో అంతరాలు లేని సమ సమాజ స్థాపనే కమ్యూనిస్టుల ఏకైక లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు అన్నారు. దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, అరాచక పాలన కొనసాగుతోందని ఆయన విమర్శించారు. దేశ ప్రజల సంక్షేమం, ఉపాధి, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రజల ప్రయోజనాల కంటే హిందుత్వ ఎజెండా అమలుకే ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక సమానత్వం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో అనేక దేశాలు కమ్యూనిజం సిద్ధాంతం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. సమ సమాజ స్థాపన కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని, పేదలు, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటాలకైనా కమ్యూనిస్టులు సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. పేదల భూములను లాక్కోవడం అన్యాయమని, అలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులేనని కూనమనేని సాంబశివరావు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరు వెంకటేశ్వర్లు తోపాటు తదితరులు పాల్గొన్నారు

## నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై పెబ్బేరు పోలీసుల ప్రత్యేక డ్రైవ్

- 70కి పైగా వాహనాలను నిలిపివేసి అవగాహన -- నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తామని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ హెచ్చరిక
- రూ.50 వేల వరకు జరిమానాలు విధింపు



**పెబ్బేరు (జఖ న్యూస్ )**పెబ్బేరు, వనపర్తి జిల్లా: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట, సుభాష్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 70కి పైగా వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అనంతరం వాహనదారులకు రహదారి భద్రత, మోటారు వాహన చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలకు అనుగుణంగా నూతన నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించి, వాటి ప్రాధాన్యాన్ని వివరించిన తర్వాత వాహనాలను విడుదల చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో వివిధ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు మొత్తం రూ.50 వేల వరకు జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ, నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని అన్నారు. ఇలాంటి వాహనాలను నేర కార్యకలాపాలకు వినియోగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా దొంగతనాలు, ఇతర నేరాల దర్యాప్తులో నెంబర్ ప్లేట్లు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు.

అలాగే హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను సీజ్ చేసి, మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

పోలీస్ శాఖకు సంబంధం లేని వ్యక్తులు తమ వాహనాలపై "ూూ×జజు" అని, అలాగే మీడియాకు సంబంధం లేని వారు "ూ=జూూ" అని స్టిక్కర్లు లేదా బోర్డులు ఏర్పాటు చేసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి వాహనాలు గుర్తించినట్లయితే వాటిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అదేవిధంగా నెంబర్ ప్లేట్లపై అనుమతి లేని డిజైన్లు, చిత్రాలు, గుర్తులు లేదా చదవడానికి ఇబ్బంది కలిగించే విధంగా రాతలు ఉండకూడదని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నెంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని వాహనదారులకు సూచించారు.

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, నెంబర్ ప్లేట్లు, హెల్మెట్ వంటి భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ కోరారు. ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో ఎస్సై దివ్యారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఽ

## తపస్ సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ పోరాటం



**జులై 10 (సీ కే న్యూస్) చేగుంట:**ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ అలుపెరుగని పోరాటం

చేగుంట మండలంలోని తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా, రెడ్డిపల్లి,వడియారం, అనంతసాగర్, రుక్మాపూర్, ఇబ్రహీంపూర్, బోనాల, కొండాపూర్, పులిమామిడి, కిష్టాపూర్, కరీంనగర్, పాఠశాలలో సభ్యత్వం నమోదు చేయడం జరిగింది ఈ సందర్భంగా

తపస్ మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, దేశపతి కృష్ణమూర్తి, ప్రభాకర్, మల్లారెడ్డి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని , పిఆర్సి రిపోర్టు తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి అని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని, ఈ కుబేర్ లో పెండింగ్ ఉన్న బిల్స్ నిధులను విడుదల చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 0 1 0 పద్దు కింద వేతనాలు చెల్లించాలని,జీఓ 317 స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, ప్రతి సంవత్సరం పదోన్నతులు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ చేగుంట మండల ప్రధాన కార్యదర్శి తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షులు తిరుపతి, మండల కోశాధికారి మేముల శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.ఽ

## గ్రామపంచాయతీ కార్యాలయంలో వనమహోత్సవ కార్యక్రమం

జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామంజిగౌడ్



**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలో ఉన్నరాయని గూడెంలో గ్రామంలోఉపాధి హామీ పథకంలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్క నాటిన సర్పంచ్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులుగుండు రామాంజిగౌడ్

పల్లెలే పట్టణాలకు పట్టుకొమ్మలు తాగునీటి సమస్య నుండి పారిశుధ్యం వరకు వీధి దీపాల నుండి రోడ్ల నిర్మాణం వరకు సంక్షేపదకల అమలు నుంచి ప్రజల నిత్య సమస్యల వరకు ప్రతి విషయంలో పల్లెలే ముందుండి నడిపిస్తుంటాయి ఈ కార్యక్రమంలో కార్యదర్శి సునీత ఉపసర్పంచ్ పిడమర్తి నాగరాజు వార్డు మెంబర్స్ అమరారపు శ్రీ కల గుండు ఉషారాణి పిడమర్తి ఈశ్వరమ్మ అమరారపు రాజు రాచమల్ల శ్రీకాంతు కాంపాటి రాజు గంట లింగయ్య ధనమ్మ పావని బొబ్బమ్మ అరుణ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.

- వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికై ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.
- సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలి.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 10,** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను శుక్రవారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచనలు చేశారు.సీఐఈఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత, నిర్వాహన పై అధికారులకు పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.డయల్ 100 కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సైలు అఖిల, రాజమౌళి సిబ్బంది పాల్గొన్నారు.

# ఏరులై పారుతున్న మురికి నీరు

- ఎక్కడ రేణుకతల్లి ఆదాయం,
- భక్తుల ఆరోగ్యం ప్రమాదంలో



**జులై 10 (సీ కే న్యూస్) చేగుంట** ఎల్లమ్మ తల్లి ఆలయం మనందరికీ ఆరాధ్య దైవం. లక్షలాది భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి, ఆశీర్వాదం కోసం వస్తారు. ఆలయానికి వచ్చే ఆదాయం కూడా "ఫుల్లు"గా ఉంటుంది. కానీ గుడి ప్రాంగణం వద్ద, ప్రదక్షిణ రోడ్డుపై మురికి నీరు నిలిచి ఉండడం వల్ల భక్తులకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయి.

మురికి నీరు నిల్వ, చుట్టూ ఉన్న హోటళ్లు, దుకాణాలు, భక్తులు కాళ్లు కడుక్కున్న మురికి నీరు సరిగ్గా డ్రైనేజీ లేక రోడ్డుపైనే నిలుస్తుంది.

దుర్వాసన దోమలు రోజూ వేల మంది తొక్కడం వల్ల బురద, చెత్త కలిసి దుర్వాసన వస్తుంది. దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వచ్చే ప్రమాదం ఉంది.

పరిశుభ్రత లేదు, పవిత్రమైన గుడికి వచ్చిన భక్తులు బురద , మురికి నీళ్లలో నడవాల్సి వస్తుంది. చిన్న పిల్లలు, వృద్ధులు కింద పడే ప్రమాదం ఉంది.

మొక్కులకు ఆటంకం పూజ సామాగ్రి అమ్మే వాళ్లు, ప్రసాదం పెట్టే చోట కూడా నీళ్లు చేరడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

ఆదాయం కోట్లలో వస్తున్నా, ఆ డబ్బుతో ప్రాథమిక వసతి "పరిశుభ్రమైన నీరు ం డ్రైనేజీ" కూడా కల్పించకపోవడం బాధాకరం. కాళ్లు కడుక్కోవడానికి ప్రత్యేకంగా ఆర్వో వాటర్ ట్యాపులు, కాళ్లు కడుక్కోవడానికి ప్లాట్‌ఫారం ఏర్పాటు చేసి, అక్కడి నీరు నేరుగా డ్రైనేజీకి వెళ్లేలా చేసి ఆదాయంలో కొంత కేటాయింపు గుడికి వచ్చే హుండీ ఆదాయంలో 10% నేరుగా పరిశుభ్రత కోసం ఖర్చు చేయాలి. ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు,

# ప్రైవేట్ మరియు ప్రభుత్వవిద్యాసంస్థల బంద్ .



**సీకే న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్ళపల్లి ప్రభుత్వ ఉన్నంత పాఠశాలను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ఓలా నేడు విద్యాసంస్థలకు బందు ప్రకటించడం జరిగింది . ఫిజు రియంబర్స్మెంట్, స్యాలరేషన్ విడుదుల చేయాలని 23.000 స్కూళ్ళను మూసివేయాలనే ప్రభుత్వ ఆలోచనకు నిరసనగా నేడు బందుకు పిలుపునిస్తూ బంద్ చేయడం జరిగింది. ఈ బందును పిలుపునిస్తూ యధావిధిగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులను సురక్షితంగా వాళ్ళ గమ్య స్థలాలకు పంపించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కి వినతి పత్రం రాసివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వత్సవాయి గోపీనాథ్, అలవాల నరేందర్, శిల్ప రామారావు, లింగం తిరుపతిరావు, లింగం కోటి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్ యజమానులే ఎక్సైజ్ అధికారులా..?

- రాయపర్తిలో మద్యం దందాపై ఆరోపణలు
- బెల్ట్ షాపులపై వైన్స్ నిర్వాహకులే 'తనిఖీలు' చేశారనే చర్చ
- పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా స్పందించని ఎక్సైజ్ శాఖ
- చేరవాణి లోకి అందుబాటులోకి రాకపోవడంతో సిఐ పై పలు అనుమానాలు



**పాలకుర్తి/రాయపర్తి(సి కే న్యూస్) ప్రతినిధి పల్లె దేవేందర్ గౌడ్ :** రాయపర్తి మండలంలో మద్యం విక్రయాల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. అధికారుల పర్యవేక్షణలో ఉండాల్సిన మద్యం విక్రయాలపై పలు ఆరోపణలు వెలువడుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ మాత్రం మౌనం వీడకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మండలంలోని కాసా, శివ బాలాజీ, భద్రకాళి వైన్స్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండలంలోని ఓ గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌కు కొందరు వైన్స్ యజమానులు వెళ్లి అక్కడ తనిఖీలు నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ సమయంలో అక్కడ ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని తీసుకెళ్లినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఈ ఘటనపై బెల్ట్ షాప్ నిర్వాహకుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కూడా సమాచారం వినిపిస్తోంది. అయితే ఈ ఘటనపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెలువడలేదు. స్థానికుల ప్రశ్న ఏమిటంటే... బెల్ట్ షాపులపై తనిఖీలు నిర్వహించే అధికారం ఎక్సైజ్ శాఖకు, పోలీసులకు ఉండగా, వైన్స్ యజమానులు ఏ అధికారంతో తనిఖీలు నిర్వహించారని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఈ ఘటన నిజమైతే సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎక్కడ ఉందని నిలదీస్తున్నారు.

**పత్రిక కథనాలు వచ్చినా చర్యలు శూన్యం**

రాయపర్తి మండలంలోని మద్యం విక్రయాలపై, బెల్ట్ షాపుల వ్యవహారంపై పలు కథనాలు వెలువడుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణ, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వస్తున్నా తనిఖీలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**చేరవాణి లోకి అందుబాటులోకి రాని ఎక్సైజ్ సీఐ**

ఈ అంశంపై వివరణ తీసుకునేందుకు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐని ఫోన్ ద్వారా సంప్రదించేందుకు గత రెండు రోజులుగా ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదని సమాచారం. అధికారుల స్పందన లేకపోవడంతో ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సందేహాలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనం పాటించడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది.

**స్థానికుల డిమాండ్**

రాయపర్తి మండలంలోని అన్ని వైన్స్ షాపులు, బెల్ట్ షాపులపై జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అక్రమాలు ఉన్నట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే వైన్స్ యజమానులు అధికారుల మాదిరిగా వ్యవహరించారనే ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు పలుచోట్ల చర్చించుకుంటున్నారు.

## హాక రైతు సేవా సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు.....



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల నియోజకవర్గంలో కె. టి దొడ్డి మండలం పరిధిలో కుచినెర్ల గ్రామంలో లిహక ఫార్మర్ సర్విస్ రైతు సేవా కేంద్రం నులిఎమ్మెల్యే శ్రీ బండ్లకృష్ణమోహన్ రెడ్డి గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.

ఎమ్మెల్యే గారికి షాప్ యజమాని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు...

అనంతరం నూతన గృహప్రవేశం నందు ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారు సత్యనారాయణ స్వామి వారి దర్శించుకుని ఇంటి యజమాని కు హార్థిక శుభాకాంక్షలు తెలిపి చిరు కానుకను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీలు సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ నాయుడు, సర్పంచ్ కృష్ణ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, హరి ప్రసాద్ గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 3లక్ష రూపాయల ్రూజ లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే గారు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కె. టి దొడ్డి మండలం చింతలకుంట గ్రామానికి చెందిన భక్తవత్సల గౌడ్ ం/శీ టి. హుస్సేనప్ప గౌడు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 3లక్ష రూపాయల ్రూజ లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారి చేతుల మీదుగా అందజేయడం జరిగినది.

ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు రాముడు, కాసిం, మహాదేవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆశీర్వాద సభ విజయవంతం.

- రెండు లక్షల మందికి పైగా ప్రజలు హాజరు.
- కిక్కిరిసిన జగన్నాథపురం రహదారులులి
- కాంగ్రెస్ కార్యకర్తల్లో నయా జోష్ నింపిన ఆశీర్వాద సభ.
- పెద్ద ఎత్తున హాజరైన మహిళలు రైతులు యువత.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాధపురం లో జరిగిన రైతు ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గత నెల 30న జరగాల్సిన ఈ సభ వాతావరణ పరిస్థితుల వల్ల వాయిదా పడింది. రైతులకు పెట్టుబడి భరోసా కల్పించాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి వరుణదేవుడు మద్దతు పలుకుతున్నట్లుగా విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి రైతు భరోసాని ఆపకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేసింది. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతు భరోసా కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నున్న అన్నదాతలు హర్షాతిరేకల్లో మునిగిపోయారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం శుక్రవారం నాడు మధిర నియోజకవర్గం లోని చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో ఈ రైతు ఆశీర్వాద సభను నిర్వహించింది. ఈ సభకు రైతులు మహిళలు యువత పెద్ద ఎత్తున హాజరై ప్రజా ప్రభుత్వానికి తమ మద్దతుని సంఘీభావాన్ని ఏకకాలంలో ప్రకటించారు. వర్షాలు పడి రైతు ఆశీర్వాద సభ భగ్నమవుతుందనే ప్రతిపక్షాల ఆశలను అడి ఆశలు చేస్తూ సభ అత్యంత విజయవంతంగా ముగిసింది.

రైతు ఆశీర్వాద సభ నేపథ్యంలో చింతకాని మండలం జగన్నాధపురం కు వెళ్లే రహదారులన్నీ బస్సులు, ఇతర వ్యక్తిగత వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో వేలమంది ప్రజలు ట్రాఫిక్ లో ఇరుక్కుపోయి కిలోమీటర్ల చొప్పున కాలినడకన సభా ప్రాంగణానికి చేరుకోవడం విశేషం. వందల సంఖ్యలో బస్సులు ట్రాఫిక్ లో ఇరుక్కుపోయి ముందుకు వెళ్లలేక ఎక్కడికక్కడ ఆగిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. హెలికాప్టర్ ద్వారా సభా ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు అక్కడి నుంచి సభా ప్రాంగణం వరకు కాలినడకన నడుచుకుంటూ వచ్చారు. మార్గమధ్యంలో భారీ కేడ్లకు ఆనుకొని జేజేలు కొడుతున్న ప్రజలకు అభివాదం చేస్తూ ఇరువురు ముందుకు వెళ్లడం విశేషం. మొత్తంగా చూస్తే జగన్నాథపురం రైతు ఆశీర్వాద సభ ప్రజా ప్రభుత్వానికి ప్రజల జేజేలను.. రైతుల ఆశీర్వాదాన్ని పెద్ద ఎత్తున అందించింది అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

## 26 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ (ాణూ) బియ్యం స్వాధీనం

- వ్యవస్థీకృతంగా ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్న ముఠా గుట్టురట్టు
- 8 మంది నిందితులపై కేసు నమోదు -- 7 మంది అరెస్ట్, ఒకరు పరారీ
- ముగ్గురు రేషన్ నిర్వాహకులు, సహా ముఠా సభ్యుల అరెస్ట్ -- 6 మొబైల్ ఫోన్లు, ఒక స్కూటీ స్వాధీనం
- ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.



ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ రాయితీ (ాణూ) బియ్యాన్ని అక్రమంగా సేకరించి మహారాష్ట్రకు తరలిస్తూ బ్రాండెడ్ రైస్ పేరుతో విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్న వ్యవస్థీకృత ముఠాను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు ఛేదించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు.

వివరాలలో

గురువారం మధ్యాహ్నం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జందాపూర్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, స్కూటీపై రెండు బస్తాల్లో ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి తప్పించుకునే ప్రయత్నం చేయగా వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు షేక్ అఫ్సర్ మరియు ఎం.డి. రిజ్వాన్ గా గుర్తించారు.

వారిద్దరిని లోతుగా విచారించగా, ఆదిలాబాద్ పట్టణంలోని ఖిల్లా ప్రాంతంలో అద్దె ఇంటిలో పెద్ద ఎత్తున ాణూ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు వెల్లడించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించగా, 50 ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 25 క్వింటాళ్ల ాణూ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులు తరలిస్తున్న బియ్యంతో కలిపి మొత్తం 26 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో, నిందితులు షేక్ అఫ్తాబ్ ఏ అరబాజ్ ఏ అబ్బాస్, అబ్దుల్ సత్తార్ తో కలిసి గత కొంతకాలంగా ఆదిలాబాద్ పట్టణంలోని రేషన్ డీలర్ల నుండి తక్కువ ధరకు ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేసి ఖిల్లా ప్రాంతంలోని అద్దె గదిలో నిల్వ చేసి, అనంతరం మహారాష్ట్రకు చెందిన ఫరాన్ కు తరలించి బ్రాండెడ్ రైస్ పేరుతో విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించారు.

ఈ వ్యవహారంలో ఆదిలాబాద్ పట్టణంలోని ముగ్గురు రేషన్ షాపు నిర్వాహకులు కూడా ముఠాకు సహకరిస్తున్నట్లు విచారణలో తేలింది. షాప్ నెం.15 నిర్వాహకుడు కొమ్ము రాము, షాప్ నెం.18కు చెందిన అబ్దుల్ రహీమ్, షాపు నెం.07 తో సంబంధం ఉన్న రాచేకర్ విలాస్ ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని అక్రమంగా విక్రయించి ముఠాకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఈ కేసులో మొత్తం 8 మంది నిందితులపై కేసు నమోదు చేయగా, 7 మందిని అరెస్ట్ చేసి, మహారాష్ట్రకు చెందిన ఫరాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 26 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం, ఒక స్కూటీ, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గతంలో సైతం పలువురు అక్రమ రాయితీ బియ్యం తరలించే కేసులను నిందితులుగా ఉన్నట్లు తెలిపారు.

అరెస్టు చేసిన నిందితుల వివరాలు:

1. షేక్ అఫ్సర్(27) ం/శీ షేక్ మహమ్మద్, నివాసం ఖిల్లా, ఆదిలాబాద్ పట్టణం.
2. ఎం.డి. రిజ్వాన్(22) ం/శీ అబ్దుల్ గఫ్ఫర్, నివాసం ఖిల్లా, ఆదిలాబాద్ పట్టణం.
3. షేక్ అఫ్తాబ్ ఏ అరబాజ్ ఏ అబ్బాస్ (24), ం/శీ షేక్ జబ్బార్, నివాసం వడ్డర్ కాలనీ, ఆదిలాబాద్.
4. అబ్దుల్ సత్తార్ ఏ షేక్ సత్తార్(37) ం/శీ అబ్దుల్ ఖదీర్ షేక్, నివాసం చిలుకూరి లక్ష్మీనగర్, ఆదిలాబాద్.
5. ఫరాన్, మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వ్యక్తి (పరారీలో ఉన్నాడు).
6. రాచేకర్ విలాస్(39) ం/శీ రాచేకర్ శంకర్, ఫెయిర్ ప్రైస్ షాప్ నెం.07 సంబంధించిన రేషన్ డీలర్, నివాసం తాటిగూడ, ఆదిలాబాద్.
7. కొమ్ము రాము(40) ం/శీ పోశెట్టి, ఫెయిర్ ప్రైస్ షాప్ నెం.15 రేషన్ డీలర్, నివాసం శాంతినగర్, ఆదిలాబాద్.
8. అబ్దుల్ రహీమ్ (44) ం/శీ అబ్దుల్ అజీజ్, ఫెయిర్ ప్రైస్ షాప్ నెం.18 రేషన్ డీలర్, నివాసం ఖానాపూర్, ఆదిలాబాద్.

వీరందని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేస్తున్నట్లు, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిపై చర్యలు తీసుకో పడతాయని తెలిపారు.

ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమంగా తరలించిన, కొనుగోలు చేసిన, విక్రయించిన, నిలువ ఉంచిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వం పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రాయితీ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం, బ్రాండెడ్ రైస్ పేరుతో విక్రయించడం వంటి చర్యలపై జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఆదిలాబాద్ రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్తో పాటు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## రైతు ఆశీర్వాద సభకు భారీ ర్యాలీతో ప్రదర్శన

- కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- గ్రామంలో ఆకట్టుకున్న బైక్ ర్యాలీ
- మల్లు భట్టి విక్రమార్క పాటలతో మారుమోగిన గ్రామ పురవీధులు





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల కేంద్రంలో చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి గ్రామ పురవీధులలో బైక్ ర్యాలీతో భారీ ప్రదర్శన చేశారు.

రైతును రాజు చేయడమే ప్రజా పాలన లక్ష్యం అని ప్రతి ఒక్క రైతు ప్రజా ఆశీర్వాద సభకు రావాలని పిలుపునిస్తూ భారీ ర్యాలీ ప్రదర్శన చింతకాని పురవీధుల్లో చేశారు.

అనంతరం బైక్ ర్యాలీతో రైతు ఆశీర్వాద సభకు బయలుదేరి వెళ్లారు.

ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు మెంబర్లు కిలారు బాబురావు, పొనుగోటి బాబు, వేముల ఆకాష్, షేక్ రహింతుల్లా, కోలా నాగేశ్వరావు ,మనోహర్ బాబు యూత్ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత దూషణలే సీఎం ఎజెండా

**మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్**



**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం :**

అభివృద్ధి, ప్రగతి అంశాలను వదిలేసి రోత మాటలు, బూతులు, వ్యక్తిగత దూషణలతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్, పువ్వాడ అజయ్ కుమార్ లపై సీఎం రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడారని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ విమర్శించారు. సీఎం పర్యటనతో ఖమ్మం జిల్లాకు కొత్తగా ఒరిగిందేమీ లేదని అన్నారు.

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలో సీఎంగా కేసీఆర్ ఖమ్మం జిల్లాకు వచ్చిన ప్రతిసారీ వందల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు ప్రకటించేవారని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనల్లో అభివృద్ధి కంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి పదవికి రేవంత్ కళంకం తెస్తున్నారని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారుద

### చిన్న మండవ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రైతు ఆశీర్వాద సభకు బయలుదేరిన చిన్నమండవ గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న , చిన్న మండవ గ్రామ శాఖ పర్సగాని వెంకట రాములు మరియు ఉపసర్పంచ్ తంగిరాల మాధవి ఆధ్వర్యంలో రైతు ఆశీర్వాద సభ కు బయలుదేరిన గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానుల వార్డు నెంబర్స్ మండల సేవాదళ్ అద్యక్షుడు పర్సాగాని సతీష్ తదితరులు పాల్గొన్నారు

# పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం గారి నాయకత్వంలో నెరవేరినది

## ధరూర్ మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే గారు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల

ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పరిధిలోని నాగర్ దొడ్డి ఆర్ఆ ఆర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు హాజరయ్యారు.

ధరూర్ మండలం పరిధిలోని నాగర్ దొడ్డి ఆర్ ఆ ఆర్ సెంటర్ గ్రామానికి చెందిన చాకలి తిప్పన్న కు లిమంజూరు కావడం జరిగినది . నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది .

నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు కానుకను అందజేశారు .

ఎమ్మెల్యే గారికి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ....

నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.

గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న.



త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు.

ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డి గారికి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గారికి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు .....

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...

ఎన్నో ఏళ్ళ గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సారథ్యంలో ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం గారికి మంత్రి గారికి మా ఎమ్మెల్యే గారికి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఆలయం కమిటీ ఛైర్మెన్ వెంకటరామిరెడ్డి, సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భీమ్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, బషీర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి.

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల

ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

శుక్రవారం గద్వాల పట్టణంలోని 30వ వార్డు, రాతి బురుజు ప్రాంతం, పోలింగ్ స్టేషన్ నెంబర్ 260లో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిని సమీక్షించారు. ఫారాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, పూర్తిగా పూరించిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒక్కో ఫారం డేటా ఎంట్రీకి ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించి పెండింగ్ తగ్గించాలని ఆదేశించారు.

ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని సంప్రదించాలని, ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి ప్రత్యేకంగా ఫాలోఅప్ చేయాలన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓలు ఓటర్లతో మర్యాదగా



వ్యవహరించి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు.

ఈ పర్యటనలో స్థానిక 30వ, వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఉపతహసిల్దార్ వరప్రసాద్, ఎన్నికల డీటీ ఉదయ్ కిరణ్, ఆర్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ తిమ్మప్ప, బిఎల్ఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# తేజ్ భరత్ ను తప్పించండి... వి.ఎం.ఆర్.డి.ఏ ను కాపాడండి.

**విశాఖపట్నం,** సికే న్యూస్ ప్రతినిధి :విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (విఎంఆర్డిఏ) గా మారిన చారిత్రాత్మక మెట్రోపోలిటన్ కమిషనర్ తేజ్ భరత్ అవినీతి అక్రమాలు పెత్తందారీ విధానాల కారణంగా పీకల్లోతు కష్టాల్లోకి వెళ్లిపోయింది అన్నారు జనసేన నేత పీతల మూర్తి యాదవ్. శుక్రవారం మూర్తి యాదవ్ జనసేన పార్టీ కార్యాలయంలో పత్రికాసమావేశం నిర్వహించి మాట్లాడుతూ అత్యంత నిజాయితీ పరులుగా పేరొందిన విఎంఆర్డిఏ కి వందల కోట్ల ఆదాయాన్ని సమకూర్చిన బసంత్ కుమార్, యువరాజ్, విశ్వనాథన్ వంటి అధికారుల తర్వాత అత్యంత అవినీతిపరు డైన తేజ్ భరత్ ఇక్కడికి రావడం వి.ఎం.ఆర్.డి.ఏ మనుగడకే శాపంగా మారింది. తేజ్ భరత్ అవినీతి అక్రమాల కారణంగా విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన విఎంఆర్డిఏ ఇప్పుడు ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తేజ్ భరత్ అవినీతి అక్రమ వ్యవహారాలపై విచారణ జరిపి ఆయన పై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను అని యాదవ్ అన్నారు.

తేజ్ భరత్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వి ఎం ఆర్ డి ఏ దైనందిన వ్యవహారాల కోసం రాష్ట్ర ప్రభుత్వంలో ఏ శాఖకు లేని విధంగా దజనకు పైగా యాప్ లను తయారు చేయిస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం కాకుండా కేవలం తన స్వార్థం కోసం తనకు బాగా తెలిసిన అమరావతి సాఫ్ట్ వేర్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి కోట్లు కట్టబెట్టేందుకు మాత్రమే ఈ యాప్లను తయారు చేయిస్తుండడం గమనార్హం. నిర్మాణ్, పి.ఎం.ఎస్, విస్తా, తపాల్స్, వైబ్, అసెట్ 360, ఎల్.పి.ఎం.ఎస్ , వి టాస్క్ మేనేజర్, హెచ్.ఆర్.ఎమ్.ఎస్, అకౌంట్స్ వంటి పేర్లతో యాప్ లను తయారు చేయిస్తున్నారు. నిజానికి ఒక యాప్ తయారు చేయించడానికి రెండు నుంచి ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుంది. నిర్వహణకు మరో ఐదు లక్షలు ఛార్జ్ చేస్తారు. విచిత్రంగా వి.ఎం.ఆర్.డి.ఏ నే నిలువునా దోచేయటానికి వచ్చిన తేజ భరత్ మాత్రం యాప్ ల తయారీ నిర్వహణకు గాను సంవత్సరానికి ఏకంగా రెండు కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నారన్నారు. ఈ రెండు కోట్లతో కథ ముగియలేదని 53 లక్షల రూపాయల వ్యయంతో విఎంఆర్డిఏ కేసుల వివరాలు తెలుసుకునేందుకు లా యాప్ ను ప్రత్యేకంగా రూపొందించారు. విఎంఆర్డీఏకి లా సెక్షన్ ఉంటుంది దానికి అధికారులు సిబ్బంది ఉంటారు. వారి వద్ద ఫైల్స్ అన్ని సిద్ధంగా ఉంటాయి. జిల్లా కోర్టుతో పాటు హైకోర్టులో కూడా స్టాండింగ్ కౌన్సిల్ ఉంటుంది. అయితే విచిత్రంగా తేజ్ భరత్ ధన దాహంతో యాప్ తయారీకి 53 లక్షల రూపాయలు వెచ్చించారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా నిర్వహణ కోసం ప్రతి నెల 2.50 లక్షల రూపాయలు ఆ యాప్ కోసం మూడేళ్ల పాటు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. గతంలో తేజ్ భరత్ మెప్మా ఎండిగా పనిచేసి అక్కడ కూడా చిత్ర విచిత్ర మైన యాప్ లతో ఉద్యోగులను వేధింపులకు గురి చేశారు. మెప్మాలో యాప్ లు తయారుచేసిన సంస్థని, అదే వ్యక్తులని ఇప్పుడు తేజ్ భరత్ వి ఎం ఆర్ డి ఏ కు తీసుకువచ్చి నిధులు వారి పేరిట కైంకర్యం చేసేస్తున్నారని యాదవ్ అన్నారు.

దృష్టి డ్రోన్ కెమెరాల పేరిట దోపిడి.

విఎంఆర్డిఏ వుడా గా ఉన్నప్పుడే డ్రోన్ వంటి వాటి సాయం లేకుండా వందలు వేల లేవట్లను పరిశీలించి వాటికి అనుమతులు ఇచ్చింది. వందల కిలో మీటర్ల రహదారులు నిర్మించింది. తేజ్ భరత్ వచ్చిన తర్వాత విఎంఆర్డిఏ సహజసిద్ధంగా చేసే ఈ పనులు అన్నింటిని ఓ డ్రోన్ సంస్థకు బదిలీ చేశారు. అవసరం ఉన్న లేకున్నా డ్రోన్లతో పని చేస్తున్నట్లు రికార్డులు సృష్టించి కోట్ల రూపాయలు ఆ సంస్థకు కట్టబెడుతున్నారు. ఇప్పటికే ఏంట్రో ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్ అనే ఆ సంస్థకు దృష్టి డ్రోన్ కెమెరా పేరిట రెండున్నర కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించేశారు. ఇదే ఏంట్రో ల్యాబ్స్ సంస్థకు రూ.4.50 కోట్ల కంప్యూటర్ల కొనుగోలు కాంట్రాక్ట్. ఇదే సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా మిగిలిన సంస్థల పీక నొక్కేసి 4.50 కోట్ల రూపాయల కంప్యూటర్ల కొనుగోలు కాంట్రాక్ట్ ఏకపక్షంగా ఇచ్చేశారు. విఎంఆర్డిఏ కి అవసర మైన కంప్యూటర్లను గత ఏడాదే విశ్వనాథన్ కమీషనర్ గా ఉండగా మార్కెట్ రేటు కొని వినియోగిస్తున్నారు. కేవలం తన స్వార్థం కోసం అవసరం లేకుండా తేజ్ భరత్ నాలుగున్నర కోట్ల రూపాయలతో కొత్త కంప్యూటర్లు కొనుగోలు చేసి విఎంఆర్డిఏ పై ఆర్థిక భారం వేశారు. కోటిన్నరకు వచ్చే ఈ కంప్యూటర్లను 4.5 కోట్లకు కొన్నట్లు చెబుతున్నారని యాదవ్ ఆరోపించారు. జిమ్ కూడా ఈ ఏంట్రో ల్యాబ్స్ సంస్థకే. రాష్ట్ర మాజీ గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా సంజీవిని పేరుతో వుడా ఉద్యోగుల కోసం ఉద్యోగ భవన్ తొమ్మిదవ అంతస్తులో ఏర్పాటు చేసిన జిమ్మును తన స్వార్థం కోసం తేజ భరత్ అక్కడి నుంచి తీసేశారు. వి.ఎం.ఆర్.డి తో కలిసి పని చేసే విశాఖ ఎకనామిక్ రీజియన్ (వి.ఈ.ఆర్) ఆఫీసుకు స్థలం కావాలంటూ జిమ్ముని కొల్లగొట్టేశారు. అయితే నెలకు 3 లక్షల రూపాయలు ఆదాయం వచ్చే ఉద్యోగ భవన్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్ లోని ఫర్నిచర్ షాప్ ని ఖాళీ చేయించి రెండు కోట్ల రూపాయల వ్యయంతో కొత్త జిమ్ ఏర్పాటు చేయించారు. పాత జిమ్మును యధావిధిగా తరలించ కుండా కొత్త జిమ్ ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందో సాటి వి ఎం ఆర్ డి ఏ ఉద్యోగులకు అర్థం కాలేదు. 45 లక్షల రూపాయలతో పూర్తి కావాల్సిన జిమ్ కు రెండు కోట్ల రూపాయలు ఎందుకు వెచ్చించారో? ఆ కాంట్రాక్ట్ కూడా డ్రోన్లు, కంప్యూటర్ల సరఫరా చేసే ఎంట్రో ల్యాబ్ ఐటీ సొల్యూషన్ కి ఎందుకు ఇచ్చారో తేజ్ భరత్ కే అర్థం కావాలి. జిమ్ అవినీతి కథ ఇంతటితో ముగియలేదు.

## దిగ్విజయంగా తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్

జిల్లాల్లో మంచి స్పందన



సికే న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ : గ్రామీణ స్థాయి వరకు నాణ్యమైన క్రీడా విజ్ఞానాన్ని అందించే రాష్ట్రంలో క్రీడా సాంస్కృతిని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం తెలంగాణ జిల్లాలోని పలు జిల్లా కేంద్రాల్లో దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. గచ్చిబౌలి స్టేడియం లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి టి ఉష చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం

ఈరోజు జిల్లా కేంద్రాల్లో దిగ్విజయంగా నిర్వహింపబడింది ఆయా జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ఫిజికల్ డైరెక్టర్లు సీనియర్ క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.తెలంగాణ క్రీడా శాఖ రూపొందించిన

తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ అనే ఈ వినూత్న కార్యక్రమం ద్వారా క్రీడా నిపుణుల జ్ఞానాన్ని రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం, జిల్లాకు చేరవేయడం ప్రధాన లక్ష్యం.ప్రతి మొబైల్ బృందంలో ముగ్గురు కోచ్‌లు, ఒక ఫిజియోథెరపిస్టు, ముగ్గురు సీనియర్ క్రీడాకారులు మరియు ఒక ప్రత్యేక అధికారి పాల్గొని క్రీడలకు సంబంధించిన శాస్త్రీయ అవగాహన, ప్రాయోగిక శిక్షణ మరియు మార్గదర్శకాన్ని అందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానంగా క్రింది అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

క్రీడల ప్రాథమిక నైపుణ్యాలు మరియు సాంకేతికతలు

గాయాల నివారణ, పునరావాసం మరియు పునరుద్ధరణ

హైడ్రేషన్ మరియు క్రీడా పోషకాహారం

ఒత్తిడి నిర్వహణ మరియు క్రీడాకారుల మానసిక ఆరోగ్యం

కోచ్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పి ఈ టి లు), ఫిజికల్ డైరెక్టర్లు (పి డీ లు), క్రీడాకారులు మరియు క్రీడాభిమానులకు రిఫ్రెషర్ శిక్షణ.గ్రామీణ స్థాయి వరకు నాణ్యమైన క్రీడా విజ్ఞానాన్ని తీసుకెళ్లడం ద్వారా రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడం, కోచింగ్ ప్రమాణాలను మెరుగుపరచడం, శాస్త్రీయ క్రీడా శిక్షణను ప్రోత్సహించడం మరియు తెలంగాణలోని ప్రతి జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. జిల్లాలో నిర్వహించిన ఈ కార్యక్రమం కు మంచి స్పందన లభించింది. క్రీడా విజ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకొచ్చే లక్ష్యంతో కోచింగ్ ప్రమాణాలను క్రీడా శిక్షణను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషమని క్రీడాభిమానుల నుండి హర్షం వ్యక్తం అవుతోంది. ఈ కార్యక్రమం రేపు 11వ తేదీ శనివారం నాడు మరియు 12వ తేదీ ఆదివారం నాడు కూడా మిగతా జిల్లాల్లో కొనసాగుతోంది. ఈ కార్యక్రమాలను హైదరాబాదులోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు నిరంతరం సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నారు.ం

## సబ్ జూనియర్ల షటిల్ సమరం షురూ

యోనెక్స్-సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభం



సికే న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ (స్పోర్ట్స్): రాష్ట్రంలోని ప్రతిభావంతులైన యువ షటిలర్లకు వేదికగా నిలిచే యోనెక్స్-సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ (అండర్-17) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2026 శుక్రవారం హైదరాబాద్‌లోని జేఎస్‌కే-చేతన్ ఆనంద్ స్పోర్ట్స్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది.మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అండర్-17 షటిలర్లు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో తమ ప్రతిభను చాటనున్నారు. తొలి రోజే జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఉత్కంఠభరిత ప్రదర్శనతో ఆకట్టుకోగా, తదుపరి దశకు అర్హత సాధించేందుకు హోరాహోరీగా పోటీపడ్డారు.బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బి ఏ టి) ఆధ్వర్యంలో, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ చాంపియన్‌షిప్ రాష్ట్రంలోని యువ ప్రతిభకు వేదికగా నిలుస్తోంది. టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులతో పాటు, జాతీయ స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పించనున్నారు.ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, నిర్వాహకురాలు శారద, పీ.వి.ఎల్. కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని యువ షటిలర్లలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే ఈ టోర్నీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు క్రీడాకారులకు విలువైన అనుభవాన్ని అందించడంతో పాటు, భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహుకరించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.




చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు లో జరిగిన రైతు ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు ,వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో కలిసి వెంకటేశ్వరస్వామి విగ్రహమును బహుకరించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# సీఎం సినిమా! ఎంజీఆర్, ఎన్టీఆర్ సరసన విజయ్

ముఖ్యమంత్రి పీఠంపై ఉండగా సొంత సినిమా విడుదలవడం.. భారత సినీ, రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం. గతంలో ఎంజీఆర్, ఎన్టీఆర్ మాత్రమే సాధించిన ఈ ఘనత ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ ఖాతాలో చేరుతోంది. నటుడిగా ఆయన చివరి చిత్రం 'జననాయగన్' ఎన్నో అడ్డంకులను అధిగమించి జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ప్రయాణం అంత సాఫీగా సాగలేదు. తొలుత సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కావాల్సిన సినిమా, సెన్సార్ బోర్డుతో వివాదాలు, కోర్టు కేసుల కారణంగా ఏకంగా ఏడు నెలలు వాయిదా పడింది. ఏప్రిల్ 9న సినిమా మొత్తం ఆన్‌లైన్‌లో లీక్ కావడం నిర్మాతలకు పెద్ద షాక్ ఇచ్చింది. ఎట్టకేలకు జూలై 9న సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేయడంతో విడుదల మార్గం సుగమమైంది. అయితే 'ఏ' సర్టిఫికెట్ రావడం అభిమానులకు మైనస్‌గా మారింది. పిల్లలకు స్పెషల్ షోలు వేయాలన్న విజయ్ పార్టీ టీవీకే ప్రణాళికలకు సెన్సార్ నిబంధనలు అడ్డుకట్ట వేశాయి. హెచ్ వినోత్ దర్శకత్వంలో సుమారు రూ.300-500 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం, బాలకృష్ణ బ్లాక్‌బస్టర్ 'భగవంత్ కేసరి'కి అధికారిక రీమేక్. అయితే మమిత బైజు ఎపిసోడ్ వినా.. సెకండాఫ్, విలన్ ట్రాక్, ఫ్లాష్‌బ్యాక్‌లను పూర్తిగా మార్చేశారని సమాచారం. క్లైమాక్స్ రజనీకాంత్ 'రోబో' రేంజ్‌లో ఉంటుందని టాక్. బాబీ డియోల్, పూజా హెగ్డే, ప్రకాశ్ రాజ్, ప్రియమణి కీలక పాత్రల్లో నటించగా, అనిరుధ్ సంగీతం అందించారు. విశేషమేమిటంటే.. టికెట్ ధరల విషయంలో అనవసర పెంపు ఉండకూడదని స్వయంగా సీఎం విజయే పర్యవేక్షిస్తున్నారు. 'జననాయకుడు' అనే టైటిల్‌తో వస్తున్న చిత్రం.. సినిమానా? రాజకీయ ప్రచారమా? అనే చర్చకూ తెరలేపింది. టాక్‌తో సంబంధం లేకుండా తమిళనాడు, ఓవర్సీస్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల రికార్డులు తిరగరాయడం మాత్రం ఖాయమని ట్రేడ్‌వర్గాలైతే అంచనా వేస్తున్నాయి.



హాట్ స్టార్!




# నా కెరీర్‌కు ఆ సీక్వెన్స్ పెద్ద సవాల్



విభిన్న పాత్రల్లో నటిస్తూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రష్మిక తాజాగా ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్రంలో ఎంతో కష్టమైన అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. భారత చలన చిత్రరంగంలో ఏ హీరోయిన్ ఇప్పటి వరకూ ఇలాంటి అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్ చేయలేదని టీమ్ తెలిపింది. దీంతో ఈ సన్నివేశం చేసిన తొలి నటిగా రష్మిక నిలిచారు. దీనిపై రష్మిక పోస్ట్ పెట్టారు. "నేను కొద్దిరోజులుగా సోషల్ మీడియాకు దూరంగా ఉన్నానని తెలుసు. కానీ ఆ సమయంలో మేమంతా ఈ సీక్వెన్స్‌లో నిమగ్నమై ఉన్నాం. నా కెరీర్‌లో నేను చేసిన వాటిలోకెల్లా ఇది అత్యంత సవాలుతో కూడినది. దీని కోసం చాలా కష్టపడ్డాం. కానీ ఈ అనుభవం నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది" అని తెలిపారు. ఈ ప్రమాదకరమైన పోరాట ఘట్టాన్ని తను డూప్ లేకుండా స్వయంగా చేసినట్టు చిత్ర బృందం ప్రకటించింది. నీటి అడుగున సాగే అత్యంత క్లిష్టమైన ఈ యాక్షన్ సీక్వెన్స్‌ని ఆమె రెండు రోజులపాటు దాదాపు 20గంటలు నీటిలో ఉండి పూర్తి చేసిందని తెలిపింది. భారతీయ చలనచిత్ర రంగంలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, సినిమాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఘట్టంగా ఇది నిలుస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. త్వరలోనే 'మైసా' టీజర్ విడుదల కానుంది.

# క్లైమాక్స్ స్క్రిప్ట్‌లో ఏడ్చేశా..

కుటుంబ సమేతంగా వినగలిగే పాటలు రాయడానికే ఇష్టపడతానని చెప్పే గీత రచయిత మిట్టపల్లి సురేందర్.. 'మారెమ్మ' కథ విని కదిలిపోయారట. మాధవ్ హీరోగా నటించిన సినిమాను మంచాల నాగరాజు తెరకెక్కించారు. ఇది త్వరలో థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సురేందర్. "తెలంగాణలోని ఓ పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో రూపొందిన చిత్రమిది.

నన్నెంతో కదిలించిన కథ. దర్శకుడు స్క్రిప్ట్ చెప్పినప్పుడు క్లైమాక్స్‌కి వచ్చేసరికి ఆయనతోపాటు నేనూ ఏడ్చేశా. నేను ఈ కథ విన్నప్పుడు ఎలాంటి భావోద్వేగాన్ని అనుభూతి చెందానో.. అదే ఎమోషన్‌పై తెరపై చూడగలిగా. దర్శకుడు దీన్ని అంత అద్భుతంగా రూపొందించారు. ఈ సినిమాలో మొత్తం ఆరు పాటలుంటే వాటిలో నాలుగు నేనే రాశా. ముఖ్యంగా దీంట్లోని 'మారి'లాంటి పాట రాసే అవకాశం రావడం నా అదృష్టం. మారి అనేది సినిమాలో హీరో ఆడుకునే దూడ పేరు. అతనికి.. దానికి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ పాట రూపంలో తెరపై చూపించాం.

ఈ గీతం రాస్తున్నప్పుడు నాకు నా బాల్యం గుర్తొచ్చింది" అన్నారు. "ధైర్యం' సినిమాకు నేను తొలి పాట రాశా. ఆ తర్వాత 'రాజన్న'లో 'కాలిగజ్జె ఘల్లుమంటే..', 'జార్జ్ రెడ్డి'లో 'వాడు నడిపే బండి..', 'లవ్‌స్టోరీ'లో 'నీ చిత్రం చూసి..' లాంటి విజయవంతమైన పాటలు రాశా. ఇక గతేడాది వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి'లోని పాటలన్నీ నాకు మరింత మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక ఇటీవల వచ్చిన 'పెద్ది'లో కథకి ఆయువుపట్టు లాంటి రెండు పాటలు రాశా. ఢిల్లీ ఎపిసోడ్‌లో వచ్చే 'అలసిపోవద్దురా పెద్ది, ట్రైన్లో వస్తున్నప్పుడు వచ్చే 'అనగనగా', జగపతిబాబు ఎపిసోడ్లోని 'ఆగిన శ్వాసలో ఆశయం ఉంది' పాటలు థియేటర్లో ప్రేక్షకుల్ని కదిలించాయి. ప్రస్తుతం నేను 'ఇడుపు కాయితం', 'జిల్లేడు చెట్టు', 'దేత్తడి', 'డేవిడ్ రెడ్డి'.. ఇలా దాదాపు పది చిత్రాలకు పాటలు రాస్తున్నా" అన్నారు సురేందర్.



# 'చెన్నై లవ్ స్టోరీ'కి టెక్నికల్ హర్డిల్



టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ 'చెన్నై లవ్ స్టోరీ'.. ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. సినిమాకు దర్శకుడు సాయి రాజేష్ కథ, స్క్రీన్ ప్లే అందిస్తుండగా ఎస్‌కేఎన్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా రూపొందుతున్న సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఈ సినిమాను జూలై 24న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, ఇప్పుడు ఈ చిత్రానికి కొంతకాలంగా వాయిదా పడుతూ వచ్చిన ఓ భారీ చిత్రం అడ్డంకిగా మారబోతున్నట్టు తెలుస్తోంది. తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'జననాయగన్' అన్ని అడ్డంకులను దాటుకుని ఈనెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్నట్టు తెలుస్తోంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు కూడా ఈ డేట్‌ను కన్ఫర్మ్ చేస్తూ పోస్టర్లు రిలీజ్ చేయడంతో జూలై 24న విజయ్ హవా నడవటం ఖాయంగా కనిపిస్తోంది. విజయ్ చివరి సినిమా కావడంతో తమిళనాడుతోపాటు ప్రపంచవ్యాప్తంగా 'జననాయగన్'పై భారీ హైప్ ఉంది. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్ తలపడుతుండటంతో, అదే రోజు రాబోతున్న 'చెన్నై లవ్ స్టోరీ'వైపు తమిళ ప్రేక్షకుల దృష్టి మళ్లడం కాస్త కష్టమనే చెప్పాలి. అయినప్పటికీ, ప్రధాన మార్కెట్ అయిన తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా గట్టి ప్రభావం చూపుతుందని నమ్ముతున్న మేకర్స్, రిలీజ్ డేట్‌ను వాయిదా వేసే ఆలోచనలో లేరు. మరి ఈ భారీ బాక్సాఫీస్ పోటీని తట్టుకుని కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్ స్టోరీ' ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



## రోషన్ కనకాల కొత్త సినిమా

టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల హీరోగా వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు విఐ ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె కమిశెట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదంవంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా కథను సిద్ధం చేశారు. ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక ముహూర్తపు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, టాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కనున్న సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు. త్వరలోనే టైటిల్ మరియు పూర్తి నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. అన్ని హంగులు అద్దుకుని త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది.

## ఓటీటీలోనూ 'పెద్ది' ర్యాంపేజ్

మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా జాన్వీకపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన అవైటెడ్ సినిమానే పెద్ది. మంచి ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కించిన సినిమా థియేటర్స్‌లో రాణించింది. అలా బిగ్ స్క్రీన్స్‌నుంచి నిన్ననే ఓటీటీలో విడుదలైన సినిమా ఇక్కడ కూడా సాలిడ్ రెస్పాన్స్‌తో అదరగొడుతుంది. దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో సౌత్ భాషల్లో అందుబాటులోకి వచ్చిన ఈ సినిమా.. నిన్న వస్తే ఇవాల్టికి ఇండియా వైడ్‌గా నంబర్1 స్థానంలో ట్రెండ్ అవుతున్న సినిమాగా నిలిచింది. దీనితో ఇక్కడ కూడా పెద్దిగాడి ర్యాంపేజ్ మామూలుగా లేదని చెప్పవచ్చు. ఇక ఈ సినిమాలో దివ్యేందు, జగపతిబాబు అలాగే శివరాజ్‌కుమార్ తదితరులు నటించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. వృద్ధి సినిమాస్ నిర్మాణం వహించింది.

